# క్రీడలకు తెలంగాణ సర్కారు పెద్దపీట

- గ్రామాలకు చేరిన ఆటవస్తువులు
- మండలంలోని 19 గ్రామ పంచాయితీలకు 20 స్పోర్ట్స్ కిట్లు మంజూరు
- స్పోర్ట్స్ కిట్‌లో 11 రకాల పరికరాలు

మెదక్ రూరల్, అక్టోబర్ 4: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నంది. గ్రామీణ యువతకు క్రీడలపై ఆసక్తి ఉన్నప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లో సరైన సౌకర్యాలు లేక ఎంతో మంది క్రీడాలకు దూరమయ్యారని, ప్రోత్సాహం ఇస్తే వారు మరింత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణిస్తారనే గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు అధికారులు 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీలకు ఆటవస్తువులు అందజేస్తున్నారు. గత ఏడాది జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశారు. అందులో వాల్‌బాల్, ఖోఖో కోర్టు, లాంగ్ జంప్, సింగల్ బాల్, డబుల్ బార్‌లను సిద్ధం చేశారు. క్రీడాకారులు వ్యాయామం చేసేలా వసతులు కల్పించారు. దీంతో యువజన క్రీడల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు 20 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్' మంజూరయ్యాయి. కిట్లతో పాటు క్రీడాకారుల కోసం టీ షర్టులు కూడా ఉన్నాయి. క్రీడలకు తెలంగాణ సర్కార్ పెద్దపీట వేస్తోందని 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్' పంపిణీతో గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు ఆటల్లో మరింత రాణించే అవకాశం ఉందని అధికారులు, నాయకులు పేర్కొంటున్నారు.

### సీఎం కేసీఆర్ దూరదృష్టితో..

గ్రామీణ ప్రాంత క్రీడాకారులకు ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దూరదృష్టితో చర్యలు తీసుకుంటున్నారు. పల్లెప్రగతి కార్యక్రమంలో సీసీ రోడ్లు, డైనేజీల నిర్మాణం, హరితహారంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటించారు. దీంతో గ్రామాల్లో ఆహ్లాదకరంగా మారుతున్నాయి. మరో వైపు క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రతి గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేసి అందులో సకల సదుపాయాలు కల్పిస్తున్నారు.



స్పోర్ట్ కిట్లు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు (ఫైల్)

### యువత క్రీడల్లో రాణించాలి



గ్రామీణ యువత, క్రీడాకారుల కోసం 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్' పంపిణీ చేయడం సంతోషంగా ఉంది. క్రికెట్, వాల్‌బాల్ తదతర క్రీడల్లో యువకులు చాలామంది సత్తా చాటుకుని వెలుగులోకి వచ్చు అవకాశం ఉంది. పల్లెలో ఆటలు ఆడేందుకు కేసీఆర్ ప్రభుత్వం క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి, ఇప్పుడు స్పోర్ట్స్ కిట్లు అందజేయ డం క్రీడాకారులకు ఎంతో ప్రోత్సాహకరంగా ఉంటుంది. – వికాస్, సర్పంచ్, బాలనగర్

### ప్రతి గ్రామానికి పంపిణీ చేశాం



'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్స్' ప్రతి గ్రామానికి పంపిణీ చేశాం. మండలానికి 20 కిట్లు అందాయి. గ్రామాల్లో ఇప్పటికే తెలంగాణ క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేశాం. అందులో కోర్టులు సిద్ధం చేశాం. యువత విద్యతో పాటు క్రీడాల్లో రాణించాలనే ఉదేశ్యంతో గ్రామీణ ప్రాంతాల్లో తెలంగాణ క్రీడా ప్రాంగాణాలు ఏర్పాటు చేసి స్పోర్ట్స్ కిట్లను అందజేస్తున్నాం. – పశాంత్ ఎంపీడీవో మెదక్

### ఒక్కో కిట్‌లో 11 రకాల ఆట వస్తువులు

తెలంగాణ ప్రభుత్వం యువత కోసం అందిస్తున్న 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్'లో 11 రకాల ఆటవస్తువులకు సంబంధించిన పరికరాలు ఉన్నాయి. 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్'లో క్రికెట్ బ్యాట్, రెండు జతల బ్యాటింగ్ గ్లౌజులు, జత వికెట్ కీపింగ్ గ్లౌజులు, రెండు జతల బ్యాటింగ్ ప్యాడ్లు, ఒక జత వికెట కీపింగ్ లెగగ్ గార్డ్‌లు, ఆరు బంతులు, రెండు జతల ఆర్మ్ గార్డులు, కిట్ బ్యాగ్, నాలుగు సింథటిక్ వాల్‌బాల్స్, రెండు నెట్లు, ఒక సైరకిల్ పంపు, మూడు సెట్ల డంబెల్స్ , మెజరింగ్‌టేపు, డిస్కస్‌తో 1.2 కిలోలు, ఆరు టెన్ని కాయింట్ రింగ్స్, నాలుగు స్కిప్పింగ్ తాళ్లు, మూడు ప్లాస్టిక్ విజిల్స్, ఒకటి స్టాప్ అండ్ గో వాచ్, 75 క్రీడా టీ షర్టులు ఇతర సామగ్రి కిట్‌లో ఉన్నాయి.



ఎమ్మెల్యే మదన్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

## రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలి

- గణనాథుడిని దర్శించుకున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

శివ్వంపేట, అక్టోబర్ 4: శివ్వంపేటలో 'డైనమిక్ జేఎస్‌పీ యూత్' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద బుధవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. వినాయకుడి నిమజ్జనం సందర్భంగా భారీ ఏర్పాట్లు చేశారు. స్వామివారి ఆశీస్సులతో రాష్ట్రమంతా సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాక్షించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ చంద్రాగౌడ్, జడ్పీ కో ఆప్షన్ సభ్యుడు చంద్రాగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకటరాంరెడ్డి, శివ్వంపేట మాజీ సర్పంచ్ పులిమామిడి నవీన్‌గుప్తా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

## నేడు డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలు అందజేత

వెల్దుర్తి, అక్టోబర్ 4: మండల పరిధిలోని ఉప్పులింగాపూర్‌లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్ల పట్టాలతో పాటు, మహిళలకు ప్రభుత్వం అందించే బతుకమ్మ కానుక చీరలను గురువారం (నేడు) ఎమ్మెల్యే మదన్‌రెడ్డి పంపిణీ చేయనున్నారని ఎంపీపీ స్వరూప నరేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పులింగాపూర్‌లో నిర్మించిన 48 డబుల్ బెడ్రూం ఇండ్లను గ్రామంలోని నిరుపేద లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తారని, అలాగే మండల కేంద్రమైన వెల్దుర్తి ఎంపీపీ కార్యాలయంలో మహిళలకు బతుకమ్మ చీరెలు, గ్రామపంచాయతీలకు కేసీఆర్ క్రీడా కిట్లను ఎమ్మెల్యే అందజేస్తారని ఆయన వెల్లడించారు. మండలంలోని గ్రామాల సర్పంచు లు, ఎంపీటీసీలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

## నేడు 'గౌడ సంఘం' భవనం శంకుస్థాపన

మెదక్ అర్బన్, అక్టోబర్ 4: జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ పక్కన 'గౌడ సంఘం' భవనానిక గురువారం (నేడు) మంత్రి హరీశ్‌రావు శంకుస్థాపన చేయనున్నట్లు మెదక్ మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లిఖార్జున్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.కోటి నిధులతో ఎకరా స్థలంలో ఈ భవనాన్ని నిర్మించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.



చెరువులో చేప పిల్లలను వదులుతున్న సర్పంచ్ మీనా

## మత్స్యకారుల సంక్షేమానికి సీఎం కృషి

చిన్నశంకరంపేట, అక్టోబర్4: మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్న గొప్ప సంకల్పంతోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చేప పిల్లలను ఉచితంగా అందిస్తున్నారని సర్పంచ్ మీనా తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గజగట్లపల్లి చెరువులో ఆమె చేప పిల్లలను వదిలారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు అవుసుల రవీందర్, మత్స్యసహకార సంఘం చైర్మన్ వెంకటి, మత్స్యకారులు పాల్గొన్నారు.

## కొవ్వొత్తులతో ర్యాలీ

రామాయంపేట, అక్టోబర్ 4: మండలంలోని దామరచెర్వులో గ్రామ కార్యదర్శి సంధ్యారాణి మృతికి సంతాప సూచకంగా కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. మంగళవారం రాత్రి సర్పంచ్ శివప్రసాదరావు, ఎంపీటీసీల అధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి కొవ్వొతులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, పాకాల లత చంద్రశేఖర్‌రావు, వార్డు సభ్యులుతోపాటు గ్రామస్తులు గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు.

## బట్టెమ్మ దేవాలయానికి దారివ్వండి

చిలిపిచెడ్, అక్టోబర్ 4: మండలంలోని చండూర్ గ్రామ శివారులోని బట్టెమ్మ దేవాలయంకు వెళ్లేదారిని కాపాడాలని గ్రామస్తులు, రైతులు బుధవారం తహసీల్దార్ ముసాద్దీక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు,గ్రామస్తులు కిషన్‌రెడ్డి, సత్యం, పాపయ్య, భీమయ్య, మాణయ్య, భిక్షపతి, జ్ఞానేశ్వర్, సాయిబాబా, సంతోశ్‌కుమార్, మల్లేశం, రమేశ్, లచ్చయ్య, తదితరలు పాల్గొన్నారు.

## నైపుణ్యాలను మెరుగుపర్చడానికే క్రీడా ప్రాంగణాలు

- కొల్చారం ఎంపీపీ మంజుల

కొల్చారం, అక్టోబర్ 4: క్రీడాకారుల్లో క్రీడా నైపుణ్యాలను మరింత మెరుగుపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ గ్రామాన క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసిందని కొల్చారం ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ మేఘమాల అన్నారు. మండల కేంద్రమైన కొల్చారంలోని రైతువేదికలో బుధవారం మహిళలకు బతుకమ్మ చీరల పంపిణీ, యువతకు కేసీఆర్ స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంజుల మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అన్ని వర్గాల సంక్షేమానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని, అన్ని పండుగలకు బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే గుర్తింపు వచ్చిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా యువజన సంక్షేమాధికారి నాగరాజు, ఎంపీడీవో గణేశ్ రెడ్డి, తహసీల్దార్ మహ్మద్ గఫార్‌మియా, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గౌరీశంకర్ గుప్త, ఏపీవో మహిపాల్‌రెడ్డి, పీఈటి శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, యువజన సంఘాల సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు నాగేశ్వర్‌రావు, పోచయ్య, సురేశ్‌గౌడ్, అంజనేయిలు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ చేస్తున్న ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ మేఘమాల

## గిరిజన విద్యార్థులంతా ఐక్యంగా ఉండాలి

- మున్సిపల్ చైర్మన్ జితేందర్‌గౌడ్

రామాయంపేట, అక్టోబర్ 4: గిరిజన విద్యార్థులంతా ఐక్యంగా ఉండాలని, అప్పుడే అనుకున్నది సాధిస్తారని రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం రామాయంపేటలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో గిరిజన సంఘం నాయకులను ఘనంగా ఆహ్వానించారు. అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గిరిజనుల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రత్యేక పంచాయతీలను ఏర్పాటు చేయడమే గాకుండా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నందన్నారు. రాబోయే ఎన్నికలలో మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అందుకు గిరిజన విద్యార్థుల పాత్ర ఉండాలని పద్మాదేవేందర్‌రెడ్డిని గెలిపించడమే మన బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. కార్యాక్రమంలో రామాయంపేట ఎస్టీ టౌన్ అధ్యక్షుడు శ్రీనువాస్ నాయక్, ఉపాధ్యక్షుడు మంగ్యా నాయక్, కౌన్సిలర్ నాగరాజు, మాజీ ఉప సర్పంచ్ నాగేశ్వర్‌రెడ్డి, ఎస్‌కే హైమద్ తదితరులు ఉన్నారు.



గిరిజన విద్యార్థి నూతన కమిటీతో పురపాలిక చైర్మన్ జితేందర్‌గౌడ్



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి చందు నాయక్

## వైద్య సిబ్బందికి ఒక రోజు శిక్షణ

మెదక్ అర్బన్, అక్టోబర్4: నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ ప్రివెన్షన్ కంట్రోల్ ఆఫ్ నాన్ కమ్యూనికబుల్ డీసీజేస్ కార్యక్రమం గురించి నూతన కలెక్టరేట్ కార్యాలయం ఆడిటోరియంలో బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి చందు నాయక్ ఆధ్వర్యంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వైద్యాధికారులకు, సూపర్‌వైజర్లకు, స్టాఫ్‌నర్స్‌లకు, మిడ్ లేవల్ హెల్త్ ప్రొవైడర్స్, డాటా ఎంట్రీ ఆపరేటర్స్‌కు, ఆరోగ్య కార్యకర్తలు హాజరయ్యారు. జిల్లా వైద్యాధికారి చందు నాయక్ మాట్లాడుతూ రక్తపోటు, మధుమేహం, అన్ని రకాల క్యాన్సర్లు, హృదయ సంబంధ వ్యాధులు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సి నియమాలు వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రవణ్‌కుమార్, ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి, అడిషనల్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## రైతులు అప్రమత్తంగా ఉండాలి

చేగుంట, అక్టోబర్ 4: కాండం తొలుచు పురుగులతో రైతులు అప్రమత్తంగా ఉండాలని రామాయంపేట ఏడీఏ వసంతసుగుణ సూచించారు. చేగుంట మండలపరిధిలోని వడియారంలో వరి పంటలను బుధవారం ఏడీఏ సందర్శించి, వరి పంటపై కాండం తొలుచు పురుగుల నివారణకు తీసుకునే చర్యలను రైతులకు వివరించారు. వరిలో ఆఖరి దఫా ఎరువుల వాడకంలో యూరియాతో పాటు 25 కిలోల పొటాషియం ఎరువులను ఎకరానికి వేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈవో హరిప్రసాద్, శోభరాణి, రైతులు పాల్గొన్నారు.